APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 57 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, సెప్టెంబర్ 15, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-





# ఏకేజీ భవన్‌కు.. ఏచూరి భౌతికకాయం

దివంగత నేతకు
లెఫ్ట్ నేతల నివాళి
నివాళి అర్పించిన సోనియా
తదితర నేతలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్) : కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని శనివారం ఉదయం 11 గంటలకు ప్రజల సందర్శనార్థం వసంత్ కుంజ్‌లోని నివాసం నుండి మూడు దశాబ్దాలుగా పని చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్‌కు తరలించారు. దివంగత నేతకు నివాళులు అర్పించేందుకు సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ శ్రేణులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, మేధావులు, వివిధ వర్గ, సంఘాల నాయకులు, ప్రజా ఉద్యమాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎకెజి భవన్‌కు చేరుకొని సీతారాంకు నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, జైరాం రమేష్, అజయ్ మాకెన్, రాజీవ్ శుక్లా తదితరులు నివాళులర్పించారు. ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు శరద్ పవార్ ఏకేజీ భవన్‌కు వచ్చి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, అస్సాం, బీహార్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీల సిపిఎం నేతలు సీతారాం ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు అక్కడి నుంచి ఎయిమ్స్ వరకు అంతిమ యాత్ర సాగుతుంది. అనంతరం ఆయన కోరుకున్న విధంగా భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు కుటుంబ సభ్యులు అప్పగిస్తారు.ఎయిమ్స్ నుంచి జెఎన్‌యుకు తీసుకొచ్చి స్టూడెంట్స్ యూనియన్ హాలులో శుక్రవారం సాయంత్రం ఉంచారు. సాయంత్రం 4 గంటల వరకు జెఎన్‌యులో నివాళులర్పించే కార్యక్రమం కొనసాగింది. ఆ తరువాత ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల సందర్శనార్థం వసంత్ కుంజ్‌లోని నివాసానికి తరలించారు.

## కాశ్మీర్ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

ఇంతకాలం విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయి
అప్రకటిత కర్ఫ్యూల కాలం ముగిసింది
వారసత్వ రాజకీయాలు కాశ్మీర్‌ను దెబ్బతీసాయి
కొత్త నాయకత్వంతోనే కాశ్మీర్ అభివృద్ధి
హర్యానాలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం
ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

2



## పాలేరు ఎడమ కాల్వ గండ్లను పూడ్చండి

నాలుగురోజుల్లో పంటలకు నీళ్లు వదలాలి
అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

ఖమ్మం,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్): జిల్లాలోని పాలేరు ఎడమ కాల్వకు పడిన గండి పనులను 24 గంటలూ కొనసాగేలా చేసి నాలుగురోజుల్లో పంటలకు నీళ్లు వదలాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గంలో శనివారం ఆయన పర్యటించారు. ముందుగా కూసుమంచి మండలం హట్యాతండా వద్ద పాలేరు ఎడమ కాల్వకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో కురిసిన అతి భారీ వర్షాలు, వరదలతో దాదాపు 10 వేల 300 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఇండ్లు కోల్పోయిన వారికి నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తాం. వరద సాయం కోసం వారంలోగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలుస్తానన్నారు. గండి పూడిక వివరాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులపై ఆరా తీశారు. కాల్వ శాశ్వత పునరుద్ధరణ పనులను కూడా సమాంతరంగా నిర్వహించాలని సూచించారు. గంటల వ్యవధిలో 37 నుండి 38 సెం.మీ. మేర కుంభవృష్టి వర్షం పడింది. ఇండ్లు, పశువులు, పంట పొలాలు, రోడ్లు, బ్రిడ్జి కొట్టుకుపోయి పెద్ద ఎత్తున నష్టపోయాం అన్నారు. వరద సాయం కోసం వారంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తానని చెప్పారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 10 వేలు నష్టపరిహారం అందిస్తాం. ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్ల కింద 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం కూసుమంచి మండలం మల్లాయిగూడెం, కట్టు కాచారం, తిరుమలాయపాలెం మండలం రావిచెట్టు తండ వద్ద దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జి, విద్యుత్ స్తంభాలు పరిశీలించి వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.





## పార్టీ బలోపేతంపై జగన్ దృష్టి

నలుగురు అధికార ప్రతినిధుల నియామకం
రోజా, యాంకర్ శ్యామలకు చోటు

2

## మజ్లిస్‌కు భయపడుతున్న సిఎం రేవంత్

అందుకే విమోచనోత్సవాలకు రావడం లేదు
బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు

హైదరాబాద్,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్):

మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విమోచన వేడుకలకు హాజరుకావడం లేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కేంద్రం నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి రాకపోవడం విచారకరమన్నారు. సీఎం రేవంత్ విమోచన దినమని ఎందుకు పలకట్లేదని ప్రశ్నించారు. ఈ నెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలను నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో పార్టీ నాయకులతో కలిసి ఎంపీ లక్ష్మణ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమోచన వేడులకు సీఎం రేవంత్ రెడ్డి రాకపోవడంపై మండిపడ్డారు. గత మూడేండ్లుగా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. ఈ వేడుకలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా వస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. అయితే హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఈ వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా కిషన్‌రెడ్డితోపాటు సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపన దినోత్సవం పేరుతో అధికారికంగా వేడుకలను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటూ కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ని ఆహ్వానించింది.





## ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేకులు

ఇంకెంతకాలం ప్రతిష్టంభంన కొనసాగిస్తారు
సొంత రాష్ట్ర విద్యార్థులను నాన్ లోకల్ చేస్తారా
ప్రభుత్వానికి మాజీమంత్రి కెటిఆర్ సూటిప్రశ్న

2

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# పార్టీ బలోపేతంపై జగన్ దృష్టి

**నలుగురు అధికార ప్రతినిధుల నియామకం**
**రోజా, యాంకర్ శ్యామలకు చోటు**

**అమరావతి,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్):**

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి, ఆ తర్వాత కీలక నేతలు పార్టీని వీడుతుండడంతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులకు పార్టీలో కీలక బాధ్యతలను అప్పగించడం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులను కూడా నియమించారు. నియోజక వర్గాల ఇన్‌ఛార్జీలకూ స్థానచలనం కల్పించారు. తాజాగా పార్టీకి నలుగురు కొత్త అధికార ప్రతినిధులను నియమించారు. మాజీ మంత్రి ఆర్‌కే రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర్ రావులను అధికార ప్రతినిధులుగా అపాయింట్ చేశారు. ఇదే జాబితాలో ప్రముఖ యాంకర్ శ్యామలకు కూడా చోటు దక్కడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వైసీపీ అధికార ప్రతినిధుల లిస్ట్ విడుదలైంది. అందులో మాజీ మంత్రి రోజా, యాంకర్ శ్యామల కూడా ఉన్నారు. మహిళా కోటాలో వారిద్దరికీ ప్రయారిటీ ఇచ్చారు జగన్. ఇప్పటికే వారికి ఫైర్ బ్రాండ్లు అనే పేరుంది. గత ఎన్నికల సమయంలో రోజా, శ్యామల.. ఇద్దరూ చంద్రబాబు, పవన్‌ని బాగా టార్గెట్ చేశారు. ఇప్పుడు కూడా వారికి అదే పని అప్పజెప్పారు జగన్. అధికార ప్రతినిధులుగా వైసీపీ నలుగురు పేర్లను ప్రకటించింది. భూమన కరుణాకర్ రెడ్డి, జూపూడి ప్రభాకర్, రోజా, శ్యామల ఇందులో ఉన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో కీలక పదవుల్ని భర్తీ చేస్తున్న జగన్, తాజాగా అధికార ప్రతినిధుల విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. పదవులు లేకపోయినా పార్టీ వాయిస్ ని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్.. వినిపిస్తున్నారు. వీరికి తోడు ఇప్పుడు అధికార ప్రతినిధుల జాబితా విడుదలైంది. ఇటీవల పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న రవిచంద్రారెడ్డి సాక్షి ఛానెల్ లో పార్టీ పెద్దలను విమర్శించి కలకలం రేపారు. సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన టార్గెట్ చేశారు. ఆ తర్వాత ఇతర యూట్యూబ్ ఛానెళ్లలో కూడా అలానే మాట్లాడారు. దీంతో పార్టీ అలర్ట్ అయింది. రవిచంద్రారెడ్డిని దూరం పెట్టింది. మీడియా ఛానెళ్లలో చర్చలకు వెళ్లేవారి లిస్ట్ ని ప్రకటించింది. ఈ జాబితాలో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు.. వీరితోపాటు మరో 14 మంది పేర్లు ఉన్నాయి. వీరు మినహా ఇంకెవరూ వైసీపీ తరపున ప్యానెల్ డిస్కషన్స్ లో పాల్గొనకూడదని ఆదేశాలిచ్చారు. తాజాగా పార్టీ తరపున ప్రెస్ మీట్లు పెట్టేందుకు అధికారికంగా ప్రతినిధులను నియమించారు. మాజీ మంత్రి రోజా ఇటీవల పార్టీతో కాస్త గ్యాప్ మెయింటెన్ చేస్తున్నట్టు పుకార్లు ఉన్నాయి. ఆమధ్య ఢిల్లీలో జరిగిన ధర్నాకు కూడా ఆమె హాజరు కాలేదు. ఆ తర్వాత విదేశీ యాత్రలో ఉండగా విడుదలైన ఆమె ఫొటో ఒకటి వైరల్ గా మారింది. తాజాగా విజయవాడ వరదలపై రోజా చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనంగా మారాయి. ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులంతా జగన్ ని కలిశారు. రోజా కూడా ఆ మీటింగ్ లో ఉన్నారు. ఆ మీటింగ్ తర్వాతే రోజా పేరుతో కూడిన అధికార ప్రతినిధుల జాబితా విడుదలైంది. యాంకర్ శ్యామల గత ఎన్నికల సమయంలో వైసీపీ తరపున ప్రచారంలో పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ పై ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. వైసీపీ ఓటమి తర్వాత కూడా ఆమె పార్టీతోనే ఉన్నారు. ఈ క్రమంలో ఆమెకు జగన్ కీలక పదవి ఇవ్వడం విశేషం. సినీ ఇండస్ట్రీలో ఉన్న శ్యామల వైసీపీ స్పోక్స్ పర్సన్ గా ఉంటే.. అటు మెగా ఫ్యామిలీకి, ఇటు నందమూరి ఫ్యామిలీకి కూడా వ్యతిరేకంగా మాట్లాడాల్సిన సందర్భాలు రావొచ్చు. కానీ ఆమె ప్రతిపక్షంలో ఉన్న వైసీపీతోనే కలసి నడిచేందుకు నిర్ణయించుకున్నారు. మరి పార్టీ వాయిస్ ని ఆమె ఎంత గట్టిగా వినిపిస్తారనేది ముందు ముందు తేలిపోతుంది.

# స్టీల్‌ప్లాంట్‌పై విజయసాయి రాజకీయాలు

**ఘాటుగా విమర్శించిన ఎమ్మెల్యే గంటా**

**విశాఖపట్నం,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్):**

ప్రతిదాన్ని రాజకీయం చేయడం రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డికి అలవాటుగా మారిపోయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. సింహాచలం వరాహ నరసింహస్వామిని గంటా శ్రీనివాసరావు శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డి చేసిన ట్విట్‌పై ఎమ్మెల్యే స్పందించారు. విజయసాయిరెడ్డి పరిస్థితి దురదృష్టకరంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో తాను స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. స్పీకర్ ఆమోదించడం కూడా జరిగిందన్నారు. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ పార్టీ ఎంపీగా ఉన్న విజయ్ సాయి రెడ్డి రాజీనామా చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్ఎ÷-లాంట్‌పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామిని రప్పించి... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని స్పష్టం చేశారని తెలిపారు.స్థానిక ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణ కాకుండా శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. విజయసాయిరెడ్డి రాజకీయాలు చేయాలనుకుంటే.. వేరేలా చేసుకోవడం మంచిది అంటూ హితవుపలికారు. విజయసాయి రెడ్డికి స్టీల్ ప్లాంట్ వ్యవహారంపై చిత్తశుద్ధి ఉంటే ఆనాడే రాజీనామా చేసి ఉంటే బాగుండేదన్నారు. విజయసాయిరెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేకులు

**ఇంకెంతకాలం ప్రతిష్టంభన కొనసాగిస్తారు**
**సొంత రాష్ట్ర విద్యార్థులను నాన్ లోకల్ చేస్తారా**
**ప్రభుత్వానికి మాజీమంత్రి కెటిఆర్ సూటిప్రశ్న**

**హైదరాబాద్,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రంలోఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల పక్రియకు బ్రేకులు పడటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వైద్య విద్యను అభ్యసించాలని కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థుల జీవితాలతో ఏమిటీ చెలగాటమని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాల్లో అడ్మిషన్ల పక్రియ కొనసాగుతుంటే.. తెలంగాణలో మాత్రం ఇంకెంత కాలం ఈ సందిగ్ధమని నిలదీశారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల పక్రియకు బ్రేకులు పడటం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. విద్యార్థులను ఆగం చేసి.. ఇంకెంత కాలం దీన్ని సాగదీస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డలను నాన్ లోకల్స్ గా మార్చి, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పెద్దపీట వేసే జీవో 33 అమలు కోసం కాంగ్రెస్ సర్కారు ఎందుకింత మొండిపట్టు పడుతోందని నిలదీశారు. స్థానికతను నిర్ధారించే విషయాన్ని ప్రభుత్వం ఎందుకింత వివాదాస్పదం చేస్తోందని అడిగారు. రోజురోజుకూ ఇంకా ఎందుకు న్యాయపరమైన చిక్కుల్లోకి నెడుతోందని ప్రశ్నించారు. తమ పిల్లల్ని డాక్టర్లుగా చూడాలని కలలు కంటున్న వేలాది మంది తల్లిదండ్రుల ఆకాంక్షలను దెబ్బతీసే గొడ్డలిపెట్టు లాంటి నిర్ణయాలను ప్రభుత్వం ఇకనైనా వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సమైక్య రాష్ట్రంలో కేవలం 5 మెడికల్ కాలేజీలు ఉంటే.. స్వరాష్ట్రంలో 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుని వాటి సంఖ్యను 34కు పెంచుకున్నది ఇందుకేనా అని ప్రశ్నించారు. జిల్లాకో మెడికల్ కాలేజీ నినాదాన్ని బీఆర్ఎస్ హయాంలో నిజం చేస్తే.. కాంగ్రెస్ సర్కారు రాగానే దారుణంగా నీరుగారుస్తోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఎంబీబీఎస్ ను సీట్లను ఏకంగా 8915కు పెంచుకుని రాష్ట్రాన్ని డాక్టర్ల ఫ్యాక్టరీగా తీర్చిదిద్దితే, ఆ సమున్నత లక్ష్యానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. నాటి కేసీఆర్ విజన్‌కు.. నేటి కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో గ్రహణం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నీట్ అడ్మిషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. ఆలిండియా కోటా కింద రెండో రౌండ్‌కు రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగుతున్నది. కొత్తగా కాలేజీలు మంజూరైన నేపథ్యంలో గడువును పెంచారు. ఇందులో తెలంగాణ నుంచి నాలుగు కాలేజీలు ఉన్నాయి. మహేశ్వరం, మెదక్, కుత్బుల్లాపూర్, యాదాద్రిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా కింద 28 సీట్లను రిజర్వ్ చేశారు. రెండో రౌండ్‌లో ఈ సీట్లను కూడా జతచేశారు. కానీ రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ మాత్రం నిలిచిపోయింది. 'స్థానికత'ను నిర్ధారించడంలో ప్రభుత్వం విఫలం కావటం, హడావుడిగా జీవో33ను తీసుకురావటంతో అడ్మిషన్ల పక్రియ న్యాయవివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీంతో సొంత రాష్ట్రంలో వైద్యవిద్య చదవాలన్న వేల మంది విద్యార్థుల కల త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతున్నది.



# కాశ్మీర్ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

**ఇంతకాలం విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయి**
**అప్రకటిత కర్ఫ్యూల కాలం ముగిసింది**
**వారసత్వ రాజకీయాలు కాశ్మీర్‌ను దెబ్బతీసాయి**
**కొత్త నాయకత్వంతోనే కాశ్మీర్ అభివృద్ధి**
**హర్యానాలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం**
**ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ**

**చండీఘడ్/శ్రీనగర్,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్) :**

ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలోకి దిగారు. కాశ్మీర్, హర్యానా ఎన్నికల్లో ప్రచారం చేపట్టారు. తొలిసారి దోడా జిల్లాలో పర్యటించారు. కాశ్మీర్‌లో శాంతిస్థాపనకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించనున్నాయని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి మన జమ్మూకశ్మీర్‌ను విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించారు. ఆ తరహా పార్టీలు ఈ ప్రాంతంలో అభివృద్ధిని దెబ్బతీశాయని విమర్శించారు. ఇకముందు అప్రకటిత కర్ఫ్యూలు ఉండవని, ఆరోజులు ముగిశాయని చెప్పారు. అలాగే భాజపా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పరివారవాదులు వంచన చేయడం ప్రారంభించారు. మీరు విశ్వసించిన రాజకీయపార్టీలు మీ పిల్లల భవిష్యత్తును పట్టించుకోలేదు. వారు వారి వారసుల భవిష్యత్తుపైనే దృష్టిసారించారు. జమ్మూకశ్మీర్ యువత ఉగ్రవాదంతో బాధపడింది. ఈ వారసత్వ పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, వేడుక చూశాయి.

2000 సంవత్సరం నుంచి ఇక్కడ పంచాయతీ ఎన్నికలు జరగలేదన్న సంగతి మీకు తెలిసిందే. కొత్త నేతలకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కొత్తనాయకత్వాన్ని మీ ముందుకు తీసుకురావాలని ప్రయత్నించాను. తర్వాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం. ఈ ప్రాంతంలో అప్రకటిత కర్ఫ్యూలు ఉండేవని మీకు తెలుసు. లాల్‌చౌక్ వద్దకు వెళ్లాలంటే




భయపడేవారు. కాంగ్రెస్ హయాంలో కేంద్రంలో హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆ రోజులు ముగిశాయి అని మోదీ మాట్లాడారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వెల్లడించారు. పలు హామీలను ప్రకటించారు. ఇదిలా ఉంటే.. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ లో మరో నాలుగు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కానున్న తరుణంలో.. వరుసగా ఉగ్రదాడులు, ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. కిష్త్‌వాడ్, ఉధంపుర్, పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో యాంటీ టెర్రర్ ఆపరేషన్లను మరింత పెంచినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఈ ప్రాంతాల్లో వరుసగా రెండోరోజు గాలింపుచర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. గత 42 ఏళ్లలో భారత ప్రధాని ఈ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ జరగనుంది. చీనాబ్ లోయలోని కిష్త్‌వాడ్, రాంబన్, దోడాతో పాటు దక్షిణ కశ్మీర్ జిల్లాల్లోని మొత్తం 24 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇదిలావుంటే కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రజాసేవ చేసేందుకు తనను ఆశీర్వదించిన ప్రజలు హర్యానాలోనూ బీజేపీకి 'హ్యాట్రిక్' విజయాన్ని అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. హర్యానా ప్రజల ఉత్సాహాన్ని చూస్తే బీజేపీని తిరిగి గెలిపించాలనే కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పగలనని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కురుక్షేత్రలో జరిగిన ర్యాలీలో మోదీ శనివారంనాడు పాల్గొని ప్రసంగించారు.



రైతులు, పేదలు, యువకులు, మహిళలకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్రం ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపై రైతులు, పేదలు, యువకులు, మహిళలకు లబ్ధి చేకూర్చేందుకు భారీ నిర్ణయాలు తీసుకుంటామని నేను వాగ్దానం చేశాను. ఇంకా 100 రోజులు కూడా పూర్తికాకుండానే రూ.15 లక్షల కోట్ల పథకాలను మా ప్రభుత్వం ప్రారంభించింది. పేద కుటుంబాలకు 3 లక్షల పక్కా గృహాలకు ఆమోదం తెలిపాం' అని మోదీ తెలిపారు. హర్యానాలో బీజేపీ ప్రభుత్వం పనితీరుతో పొరుగున ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ సర్కార్‌తో మోదీ పోల్చారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేసిందన్నారు. ఫలితంగా వేతనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులు నిరసలకు దిగుతున్నారని అన్నారు. కాగా, హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

# వరదప్రాంతాల్లో సహాయక చర్యలు

**స్వయంగా పర్యవేక్షించిన మంత్రి నారాయణ**

**విజయవాడ,సెప్టెంబర్14(పీపుల్స్ మోటివేషన్):**

విజయవాడ నగరంలోని వరదప్రాంతాల్లో సహాయక చర్యలను మంత్రి నారాయణ పర్యవేక్షించారు. కండ్రిక, బోస్ నగర్, జర్నలిస్టు కాలనీలో మంత్రి నారాయణ సుడి గాలి పర్యటన చేశారు. వరద నీరు ఉన్న ప్రాంతాలతో పాటు శానిటేషన్ జరుగుతున్న చిన్న చిన్న రోడ్లపై స్వయంగా బైక్ నడుపుకుంటూ మంత్రి పర్యటించారు. నిన్నటి వరకు వరద నీరు ఉన్న ప్రాంతాల్లో శరవేగంగా వందలాది పారిశుధ్య కార్మికులతో క్లీనింగ్ పనులు జరుగుతున్నాయి. జర్నలిస్టు కాలనీలో నిల్వ అన్న వరద నీటిని భారీ మోటార్‌లతో బయటికి పంపింగ్ చేస్తున్న పనులను మంత్రి నారాయణ పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... విజయవాడ సిటీలో వరద నీరు దాదాపు తగ్గిపోయిందన్నారు. రేపటికల్లా మొత్తం 32 వార్డులు సాధారణ స్థితికి వస్తాయని తెలిపారు. వరద నీటితో ఇళ్లలో చాలా బురద ఉందని... అన్ని వీధుల్లో ÷ర్ ఇంజిన్‌లు ఏర్పాటు చేసి క్లీనింగ్ చేయిస్తున్నామని తెలిపారు. డ్రైన్‌లలో ఉన్న సిల్ట్ తొలగింపు కూడా వేగంగా జరుగుతోందన్నారు. వరద నీరు ఉన్న ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ కొన్నిచోట్ల జరగలేదని బాధితులు చెబుతున్నారని... అలాంటి చోట్ల మరోసారి ఎన్యుమరేషన్ చేయమని అధికారులను అదేశించామన్నారు. వరద నీరు బయటకి వెళ్లేందుకు నున్న రోడ్డు, బై పాస్ రోడ్డు,100 అడుగుల రోడ్డులో చాలా చోట్ల గండ్లు కొట్టామన్నారు. గండ్లు కొట్టిన చోట తాత్కాలికంగా పైప్ లైన్‌లు వేయాలని అధికారులకు సూచించామన్నారు. భవిష్యత్తులో రోడ్లపై నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా కల్వర్టులు నిర్మిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । సెప్టెంబర్ । 15 । 2024



# చదువు లేకపోవడం వల్లే చెంచుల వెనుకబాటుకు కారణం

**ఐటీడీఏను ప్రక్షాళన చేద్దాం**
**చెంచులు కూడా నాగరికతను అలవరసుకోవాలి**
**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



**పాములపాడు/ నంద్యాల, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

చదువు లేకపోవడం వల్లే చెంచుల (గిరిజనుల) వెనుకబాటుకు కారణమని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తి అయినా చెంచు గిరిజన కుటుంబాల్లో ఏమాత్రం మార్పు కనపడలేదని, ఐటీడిఏ ను ప్రక్షాళన చేసి చెంచులకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగం అయ్యేలా చూస్తామని, చెంచు లలో (గిరిజనులలో) కూడా మార్పు ఎంతో అవసరమని, ఆధునిక ప్రపంచం వైపు చెంచులు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, జిల్లా అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల జిల్లా పాములపాడు మండలం వేంపెంట చెంచుకాలనీలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె చెంచు గిరిజనుల సమస్యలు ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. నంద్యాల జిల్లా పరిధిలోని నల్లమల అరణ్యం, మైదాన ప్రాంతాల్లో 42 చెంచు గూడెంలలో (గిరిజనులు) చెంచులు జీవనం సాగిస్తున్నారని, చెంచుల (గిరిజనుల) అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక నిధులు ఖర్చు చేస్తున్నాయని, అయినా ఇంకా వెనుకబాటు ఎందుకని, చెంచు పిల్లలు చదువు కుంటే తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తారని ఆమె అభిప్రాయం పడ్డారు. కనీస వసతులకు చెంచులు దూరంగా బ్రతకడం బాధేస్తోందని, అధిక సంతానం కూడా చెంచుల వెనుకబాటుకు ఒక కారణం అని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. చెంచు గూడెంలలో కనీస వసతులైన మహిళలకు వ్యక్తిగత మరుగుదోడ్లు, అంతర్గత సీసీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రాల్లో సేవల విస్తరణ, పక్కా గృహాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత నిర్బంద విద్య చెంచు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటామని, చెంచు మహిళలు కూడా మార్పుకు సహకరించాలని, తమ బిడ్డలను చదివించుకోవాలని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, పొదుపు గ్రూప్‌లలో గిరిజన మహిళలు చేరి ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీ శబరి కోరారు. చెంచు గూడెంల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు పక్కదారి పట్టిన, దుర్వినియోగం అయినా సంబంధిత ఐటీడిఏ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులపై కఠిన చర్యలు ఉంటాయాని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హెచ్చరించారు. అనంతరం వేంపెంటలోని హెల్త్ సెంటర్, అంగన్వాడీ సెంటర్లను ఎంపీ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి. వేంపెంట మాజీ సర్పంచ్ గాండ్ల రామసుబ్బమ్మ, టెలికామ్ సలహా కమిటీ సభ్యులు కురువ రమేష్, కురువ వెంకటేశ్వర్లు, వీరాపురం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మహిళా ప్రాంగణం అభివృద్ధికి సహకరిస్తాం





**ఎం.పి బస్తిపాటి నాగరాజు**

**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

ఎన్టీఆర్ స్కిల్ డెవలప్మెంట్ మరియు మహిళా సాధికారత కేంద్రం అభాగ్యులకు ఉత్తమ సేవలు అందిస్తుందని , ఈ కేంద్రం అభివృద్ధికి సహకరిస్తామని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ కంటి ఆసుపత్రి పక్కన ఉన్న ఎన్టీఆర్ .సి.ఎస్.డి,మహిళా సాధికారత కేంద్రాన్ని సందర్శించిన ఎం.పి, మహిళా ప్రాంగణం లోని వసతులను పరిశీలించారు..

ఈ సందర్భంగా కేంద్రం లోని సమస్యలు మెయింటెనెన్స్ నిధుల కొరత పై అధికారి అంజనీ భూషణ్ ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు..సిఎస్ఆర్ నిధుల కింద ప్రాంగణ అభివృద్ధికి సహకరిస్తామని, ప్రభుత్వ శిక్షణలు ఈ కేంద్రంలో జరిగేలా కలెక్టర్ తో మాట్లాడుతానని ఎం.పి హామీ ఇచ్చారు..అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం అభాగ్యులైన మహిళలకు ఎంతో సేవలు అందిస్తుందని, నగరం నడిబొడ్డులో మహిళలకు రక్షణగా ఉన్న ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట తెలుగుదేశం పార్టీ వీరశైవ సాధికారత సమితి కన్వీనర్ ఎస్వీ శివరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి







**ఎం.పి బస్తిపాటి నాగరాజు**

**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. నగరంలో ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏ.పి.టి. ఎఫ్) 80 వ వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలకు కోడుమూరు ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరి తో కలిసి ఆయన పాల్గొ న్నారు.. ఈ సందర్భంగా ఎం.పి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్. డీ.ఏ కూటమి అధికారంలోకి రావడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు.. ఉపాధ్యాయుడిగానే తన జీవితాన్ని మొదలు పెట్టానని, టీచ ర్లు పడే కష్టాలు తనకు తెలుసన్నారు..ఇక గత వైసీపీ పాల నలో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా ఉంటుందన్నారు..ఈ కార్యక్రమంలో ఏ.పి.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ రాజ్, జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరితో సమావేశమైన ఇరిగెల సోదరులు



**నంద్యాల, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

సీనియర్ రాజకీయ నాయకులు, ఆళ్లగడ్డ జనసేన ఇంచార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, జనసేన అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణరెడ్డిలు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరితో సమావేశం అయ్యారు. శనివారం నంద్యాల ఎంపీ శబరి కార్యాలయంలో ఇరిగెల సోదరులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆళ్లగడ్డ ప్రస్తుత రాజకీయాలు, ఉమ్మడి ప్రభుత్వం చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పనులు, త్వరలో జరగనున్న నామినేటెడ్ పోస్టుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎంపీ ల్యాండ్స్ మంజూరు తదితరవాటిపై ఎంపీ బైరెడ్డి శబరితో ఇరిగెల సోదరులు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో చాగలమర్రి జనసేన నాయకులు జున్ను ప్రసాద్ రెడ్డి, ఇరిగెల జయేంద్రారెడ్డిలు ఉన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి, అప్పుడే అన్ని రంగాల్లో మంచి ఫలితాలు సాధిస్తారు


**ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందుకు పట్టుదలతో పోరాడాలి : ఎం.పి బస్తిపాటి నాగరాజు**




**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

విద్యార్థులు క్రమశిక్షణ తో మెలగాలని, అప్పుడే అన్ని రంగాల్లో మంచి ఫలితాలు సాధిస్తారని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. నగరంలోని సుంకేసుల రోడ్డు లో ఉన్న ఎస్.టి జోసేఫ్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ గతంలో తాను చదువుకున్న కళాశాలకే ఇప్పుడు ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు... విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించేందుకు పట్టుదలతో పోరాడలన్నారు... ఇక అనేక కష్టాలను అధిగమించి ఈ స్థాయికి వచ్చానన్న ఎం.పి నాగరాజు...విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు... ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శాంతా, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఏ.ఓశౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడ వరద బాధితులకు తులసి సీడ్స్ కోటి రూపాయల భారీ విరాళం



**డోన్, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):**

ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వలన సంభవించిన వరదల కారణంగా విజయవాడ నగరంలోని పల్లపు ప్రాంతాలు ముంపుకు గురై జనజీవనం స్తంభించిన విషయం అందరకూ తెలిసిందే. పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నప్పటికి, తమ వంతు సహాయంగా వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి తులసి సీడ్స్ కోటి రూపాయల భారీ విరాళాన్ని ప్రకటించింది. తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, ఆయన కుమారుడు తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగిష్ ఈ రోజు అనగా ది 13-09-2024న కోటి రూపాయల భారీ విరాళాన్ని చెక్కు రూపంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని స్వయంగా కలిసి అందచేసారు. ఏటుకూరు మాజీ సర్పంచ్ శ్రీ ఉగ్గిరాల సీతారామయ్య తమ వంతు సహాయంగా రెండు లక్షల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. అదే విధంగా తులసి గ్రూప్ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం 5,43,000/- రూపాయలను చెక్కు రూపంలో తులసి గ్రూపు సంస్థలలో ఒకటైన 'డైహార్డ్ డైస్ ప్రైవేట్ లిమిటెడ్' ప్రొడక్షన్ మేనేజర్ పచ్చా వాసుదేవ్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయటం జరిగింది. 2009లో కూడా కర్నూలు వరద బాధితుల సహాయార్థం 50 లక్షల విరాళాన్ని తులసి సీడ్స్ అందజేసిందని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తమవంతు సహాయాన్ని అందజేయటానికి తులసి సీడ్స్ ముందుంటుందని తులసి రామచంద్ర ప్రభు తెలియజేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# మట్టిలో మాణిక్యం..

**అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆలూరు వాసి మధు..**



**ఆలూరు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన బసవరాజు, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు.. మొదటి సంతానం మధు సెపక్ తక్రాలో రాణిస్తున్నారు.. తల్లిదండ్రులు ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబీకులు... ఓ చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని సాయంత్రం వేళ గోబీ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు.. తల్లిదండ్రులు కూడా కుమారుడికి అడ్డు చెప్పకుండా ప్రోత్సహించడం తో అంతర్జాతీయ స్థాయి కు ఎదిగాడు. చదువుల్లో రాణిస్తూ, క్రీడల్లో పాల్గొంటూ తల్లిదండ్రులకు పనుల్లో చేదోడు వాదోడుగా నిలుస్తూ వస్తున్నాడు.. ప్రతిభ ఎవరి సొత్తూ కాదు కృషి, పట్టుదల ,క్రమశిక్షణ ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు... క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కేవలం డబ్బు, పలుకుబడి ఉంటే సరిపోదు ప్రతిభ కూడా ఎంతో అవసరం.. ఆలూరుకు చెందిన మధు అనే యువకుడు నిత్యం సాధన చేస్తూ సెపక్ తక్రా క్రీడలో దూసుకు పోతున్నారు. తాజాగా జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి అంతర్జాతీయ స్థాయి కి ఎంపికయ్యారు. ఈనెల 18 నుండి 23 వరకు చైనా లో జరిగే ఏషియన్ బీచ్ సెపక్ తక్రా ఛాంపియన్ షిప్ అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టు తరపున పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ భాష దినోత్సవం





**ఓర్వకల్లు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రామచంద్రారెడ్డి అధ్యక్షతన హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1949 సెప్టెంబర్ 14న హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించిందన్నారు. ప్రతి విద్యార్థికి హిందీ భాష పై పట్టు ఉండాలన్నారు. ఈ భాష నేర్చుకుంటే దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అందరితో హిందీలో మాట్లాడటానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఎందరో అమరవీరులు స్వాతంత్ర పోరాటంలో హిందీ భాషను ఆయుధంగా మలుచుకొని పోరాటం చేశారని గుర్తు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా "హిందీ భాష రాష్ట్ర భాష" పాటకు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, భాస్కర్, వరలక్ష్మి, చంద్రశేఖర్ రాజు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ అందించిన ఎంపీ



**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు చొరవతో ఓ పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ అందింది... కర్నూలు నగరం విఠల్ నగర్ కి చెందిన హాసిని గాయత్రి కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతుంది.. నిరు పేద కుటుంబానికి చెందిన హాసినికి తండ్రి మరణించడంతో , ఆమె తల్లి చదివిస్తుంది.. ప్రస్తుతం ఐ.ఐ.టి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినికి ల్యాప్ టాప్ అవసరం కావడంతో కొద్ది రోజుల క్రిందట ఎం.పి బస్తిపాటి నాగరాజు ను కలిసింది.. దీని పై స్పందించిన ఎం.పి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా దృష్టికి తీసుకొచ్చారు.. కలెక్టర్ కెనరా బ్యాంక్ ద్వారా సి.ఎస్.ఆర్ నిధులతో హాసినికి ల్యాప్ టాప్ మంజూరు చేశారు.. దీంతో ఎం.పి బస్తిపాటి నాగరాజు ను ఆయన నివాసంలో కలిసి విద్యార్థిని కృత్ఞతలు తెలిపారు..

# పశువులను పోసిస్తూ వాటి ఆధారంతో పాలు అమ్ముకుంటున్న మాపై పాశవిక చర్యలా..





**పశువుల మేతను దక్కనీకుండా గడ్డి మందు పిచికారీ చేసి పైశాచికంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**వ్యవసాయ భూమిలో వేసిన పరిశ్రమను అడ్డుకోవటమే పాపమా**

**అడ్డుకున్నారన్న అక్కసుతో ఆస్తి నష్టానికి పూనుకుని.. అనాలోచిత క్రిమినల్ చర్యలు..**

**కాలుష్య నివారణ చర్యలు చేపట్టకపోవటంతో చుట్టు పక్కల పంటలు పండని వ్యవసాయ భూములు....**

**గడ్డిమందు పిచికారీ చేసిన వారిపై, గడ్డి పంటను నాశనం చేసిన జె సి బి వారి మీద కేసు నమోదు చేసి న్యాయం చేయాలి**

**ఆర్థిక నష్టాన్ని ఆదుకునే ఆద్యులెవరు**

**పాడిని నాశనం చేయ చూస్తున్న పరిశ్రమ యాజమాన్యం..**

**డోన్, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్) :**

డోన్ పట్టణానికి దగ్గరలో ఉన్న తమ పొలములో పశువుల కోసం వేసుకున్న గడ్డికి పురుగుల మందు తో పిసికారి చేసి జేసిబి తో నాశనం చేశారంటూ డోన్ పట్టణానికి చెందిన సంగు నాగేశ్వరరెడ్డి,సంగు స్వామిరెడ్డి లు మీడియా ద్వారా తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం పసువులపై ఆధారపడి వాటి పాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న మేము డోన్ పట్టణంలో 2010 సంవత్సరంలో ఉడుముల పాడు గ్రామానికి చెందిన మహబూబ్ సాహెబ్ దగ్గర రెండు ఎకరాల పొలాన్ని కొన్నామాని ఆ పొలంలో పశువుల మేతకై గడ్డిని వేసుకుంటున్నామని కానీ రెండు రోజుల క్రితం ఆ గడ్డిని కొందరు వ్యక్తులు ఆ పొలాన్ని పురుగుల మందు చల్లి జెసిబి తో నాశనం చేశారని గతంలో కూడా ఇలానే పొలాన్ని నాశనం చేశారని ఆ నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కన్నీటి పర్యంతం అయ్యారు. మాకు ఎలాగైనా మీడియా ద్వారా మాకు న్యాయం చేయగలరని కోరుతున్నాను.



# పదో వార్డులో వైభవముగా కుంకుమార్చన





**పీపుల్స్ మోటివేషన్, నర్సంపేట:-**

నర్సంపేట నియోజకవర్గంలోని పదో వార్డులో పోచమ్మ ఆలయంలో నవరాత్రులలో భాగంగా ఎనిమిదవ రోజు పదవ వార్డు కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్, పోచమ్మ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో కుంకుమ అర్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.హొకౌన్సిలర్ నాగిశెట్టి.పద్మ, ప్రసాద్ మాట్లాడుతూ పదవ వార్డు ప్రజలందరూ గణనాయకుని ఆశీస్సులతో ఎల్లవేళల సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ సిద్ధి గణపతిని వేడుకొని పూజలు నిర్వహించామని తెలిపారు. పూజా కార్యక్రమంలో తాళ్ళపెల్లి కళ్యాని, నాగిశెట్టి ప్రణీత, ఎదురబోయిన , మౌనిక, అదర్సండె రమదేవి, రావిళ్ళ పద్మజ, రావిళ్ళ సుమతి,దూసరి సంపూర్ణ, పసరుగొండ మానస, కటకం రాజకళ , తౌటం వెన్నెల, బొల్లా సుమ, గందె కోటేశ్వరి, బెజ్జంకి మౌనిక, రాళ్ల బండి సరోజన, కొలువుల వసంత, కొలువుల కోకిల, బండి మాదవి, కొలపద్మ మరియు వార్డులోని మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి టి.జి భరత్ చేతులమీదుగా సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు





**దాతలను అభినందించిన మంత్రి టి.జి భరత్**

**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆపదలో ఉన్నప్పుడు చేయూతనిచ్చేందుకు ముందుకురావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీ.ఎం.ఆర్.ఎఫ్ కు మంత్రి టి.జి భరత్ చేతులమీదుగా పలువురు విరాళాలు అందించారు. ది కర్నూల్ క్లబ్ తరుపున రూ.5 లక్షలు, ది కర్నూల్ యునైటెడ్ క్లబ్ తరుపున రూ. 2 లక్షలు, కర్నూలు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ 4వ వార్డు తరుపున వార్డు ఇంచార్జి ఊట్ల రమేష్ బాబు, బూత్ ఇంచార్జీల ఆధ్వర్యంలో సేకరించిన రూ. 60 వేలు, 48వ వార్డులోని 3వ బూత్‌కు చెందిన కే.ఈ మధులతా గౌడ్ రూ.30 వేలు విరాళం ఇచ్చారు. దాతలు ఈ చెక్కులను మంత్రి టి.జి భరత్‌ను ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను టి.జి భరత్ అభినందించారు. విపత్కర పరిస్థితుల్లో చిన్నసహాయమైనా ఎంతో ఉపయోగపడుతుందని టి.జి భరత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ క్లబ్ సెక్రటరీ బాలచంద్రా రెడ్డి, జాయింట్ సెక్రటరీ చంద్రమౌలీశ్వర రెడ్డి, ట్రెజరర్ కే.ఈ శివరామ్ గౌడ్, ఈ.సి మెంబర్ దుర్గా ప్రసాద్ రెడ్డి, సలీం బాషా, ప్రెసిడెంట్ భీమేశ్వర్ రెడ్డి, సెక్రటరీ బలరాం, ట్రెజరర్ సుధాకర్ బాబు, జనరల్ సెక్రటరీ రాముడు, యేసు రత్నం, భూపాల్ రెడ్డి, సుగుణాకర్ గుప్త, ఊట్ల రమేష్, మన్సూర్ ఆలీఖాన్, కార్తీక్, బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । సెప్టెంబర్ । 15 । 2024


# సైకిల్ గణేష్ విగ్రహం ఏర్పాటుతో మొక్కు తీరింది.. రాష్ట్ర మంత్రి టి.జి భరత్




**వినాయక మండపాలను సందర్శించిన మంత్రి టి.జి భరత్**

**పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించిన మంత్రి**

**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

కర్నూలు నగరంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ సందర్శించారు. నరసింహా రెడ్డి వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనం వడ్డించారు. ఆ తర్వాత ఏ.క్యాంపు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని దర్శించుకొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మద్దూర్ నగర్, శ్రీరాం నగర్ శివాలయం వద్ద, చిన్నమార్కెట్ సిద్దేశ్వర ఆలయం వద్ద, బండిమెట్ట సర్కిల్ వద్ద, బొంగుల బజార్, చిన్నరంగరాజు వీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను మంత్రి టి.జి భరత్ దర్శించుకున్నారు. అనంతరం పలు ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను దర్శించుకొని భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వస్తే సైకిల్ వినాయకుడి విగ్రహం ఏర్పాటుచేస్తామని స్థానిక నాయకులు మొక్కుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పుడు సైకిల్ గణేష్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వినాయకుడిని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్.**

**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా, తేజోవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపు నుండి అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్ పేర్కొన్నారు. శనివారం గణేష్ నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ లతో కలిసి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ తర్వాత అంతే ప్రతిష్టాత్మకంగా కర్నూలు నగరంలో జరిగే వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం దాదాపుగా కర్నూల్ నగరంలో 2000 విగ్రహాలు ప్రతిష్టించడం జరిగిందన్నారు. నగరంలో మట్టి విగ్రహాలను ప్రతిష్టించేలా గణేష్ ఉత్సవ కమిటీ వారు ప్రజలను ప్రోత్సహించాలని మంత్రి ఉత్సవ కమిటీ వారికి సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఫిషరీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని మంత్రి పేర్కొన్నారు.. గత ఏడాది లాగే ఈ ఏడాది కూడా అంతే గౌరవంగా నిమజ్జన కార్యక్రమం జరుగుతుందన్నారు.. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా ప్రజలు కూడా సహకరించాలన్నారు. నిమజ్జనం జరిగే వినాయక ఘాట్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు 4 ప్లాట్ ఫారం లు, 8 క్రేన్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం దాదాపు 26 సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య మాట్లాడుతూ గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని, వినాయక ఘాట్ లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. ఘాట్ దగ్గర కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని సంబంధిత కంట్రోల్ రూమ్ లో అన్ని డిపార్ట్మెంట్ల నోడల్ ఆఫీసర్లు , ఫైర్ డిపార్ట్మెంట్, ఫిషరీస్, మెడికల్, శాఖల సిబ్బంది అందరూ అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జనానికి 1700 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని విగ్రహాలు ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా పోలీస్ సిబ్బందిని కూడా కేటాయించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కంట్రోల్ రూమ్ లో 24 గంటలు పోలీసు అధికారులు అందుబాటులో ఉండేలా కూడా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి , డిటిసి, ఆర్ అండ్ బి అధికారులు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, మత్స్య శాఖ అధికారి, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనం రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు : ఎస్పై హరిప్రసాద్ రెడ్డి

**పెబ్బేరు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్): -**

వనపర్తి జిల్లా పెబ్బేరు ఎస్పై శనివారం తెలియజేస్తూ, గణేష్ విగ్రహ నిమర్జనం రోజున నిర్వాహకులు పాటించవలసిన నియమాలు మరియు పోలీసు వారి సూచనలు.

1) నిమర్జనం కోసం విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై (డి జె ) తో కూడిన మ్యూజికల్ సిస్టమ్ ను అనుమతించబడదు, తక్కువ శబ్దం వచ్చే లౌడ్ స్పీకర్ను ను అమర్చుమని నిర్వహకులకు తెలియజేయాలి.

2) నిమర్జనం కోసం విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం కండిషన్ లో ఉన్నదా? లేదా?, దానిని నడిపే డ్రైవరుకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండవలెను, మద్యం తాగిన వ్యక్తిని వాహనం నడపటానికి అనుమతించరాదు.

3) నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ఊరేగుంపును తీసుకొనివేళ్ళవలేను, మద్యం లేదా మరేదైనా మత్తుమందులు సేవించిన వ్యక్తులను అనుమతించకూడదు.

4) విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహనం బాటసారులకు కానీ, ఇతర వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం కలిగించరాదు.

5) విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహనం వేరే మతాల ప్రార్థనా స్థలం దగ్గర ఆపి అంతరాయం కలిగించరాదు, మత సామరస్యానికి భంగం కలిగించకుండా చూడవలెను.

6) రోడ్డుపై వెళ్ళు బాటసారులపై మరియు పరిచయం లేని వ్యక్తులపై రంగులు కానీ, కుంకుమ గాని, గులాల్ కానీ, నీళ్లుకాని, పూలుకాని చల్లడం లేదా వేరే ఇతర వస్తువులు వేయటం చేయరాదు.

7) ఊరేగింపులో ఎవరూ కర్రలు, మండే పదార్థాలు లేదా ఏదైనా ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకెళ్లకూడదు.

8) ఊరేగింపు సమయంలో బాణాసంచా ఉపయోగించరాదు.


9) ఊరేగింపుల్లో ఏలాంటి రాజకీయ ప్రసంగాలు/రెచ్చగొట్టే ప్రసంగాలు/ నినాదాలు లేదా రెచ్చగొట్టే భంగిమలు లేదా బ్యానర్లు లేదా ప్రజలలో ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే, రెచ్చగొట్టే చర్యలు లేవనెత్తకూడదు లేదా ప్రదర్శించకూడదు.

10) ఊరేగుంపులో చిన్న పిల్లలను అనుమతించరాదు మరియు మహిళల పట్ల మర్యాద పూర్వకంగా ఉండవలెను.

11)లేజర్ లైట్లు వాడరాదు

12) ఊరేగింపు వెల్లునపుడు విద్యుత్తు తీగలను, ఇతర తీగలను గమనించి, విగ్రహానికి కానీ, వాహనంపై ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూసుకోవలెను.

13) పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించాలి.




## దేశవ్యాప్త సామాజిక ఉద్యమాలను సమన్వయ పరచడం లో కీలక పాత్ర కామ్రేడ్ ఏచూరి ది

**జననం జనం కోసమైతే మరణం చిర స్మరణీయం అన్నదానికి నిదర్శనం సీతారాం**



**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

దేశ వ్యాప్త ఉద్యమాలకు వేగు చుక్క, సమసమాజ స్వాప్నికుడు, తెలుగు బిడ్డ సీతారాం ఏచూరి కి లాల్ సలాం, నీల్ సలాం అంటూ కెవిపియస్ కర్నూలు న్యూసిటి కమిటి ఆధ్వర్యంలో సీతారం ఏచూరి సంతాప కార్యక్రమాన్ని శనివారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్లో నిర్వహించారు. కెవిపియస్ కర్నూలు న్యూసిటి అధ్యక్షులు యేసు రాజు అధ్యక్షతన జరిగిన సంతాప సభ కార్యక్రమంలో ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు, మాజీ నగర కార్యదర్శి ఆర్ నరసింహులు, జిల్లా నాయకులు రోషన్న మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జననం జనం కోసమైతే మరణం చిర స్మరనీయం అన్నదానికి నిలువెత్తు నిదర్శనం సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రంలో కులవివక్షత అంటరానితనానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న కెవిపిఎస్ ను అభినందించడంతోపాటు తమిళనాడు, కర్ణాటక, బెంగాల్, ఢిల్లీ లాంటి రాష్ట్రాలలో సామాజిక సమస్యలపై ప్రత్యేక ఉద్యమాన్ని నిర్వహించే సంస్థల ఏర్పాటుకు తోడ్పాటునందించారన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక ఉద్యమాలను నడిపే సంఘాలను సంస్థలను సమన్వయ పరచడం కోసం దళిత్ సోషన్ ముక్తి మంచ్ ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర కామ్రేడ్ ఏచూరిదే అన్నారు. ఈ దేశంలో ఏచూరి ఆశించిన సమ సమాజం స్థాపించాలన్న అందుకు ఆటంకంగా ఉన్న కుల అసమానతులకు సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా మొక్కవోని దీక్షతో పోరాడడడమే ఏచూరి కి ఇచ్చే నివాళి అని వారు పేర్కొన్నారు. సంతాప సభలో కెవిపిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎం రాజశేఖర్, నగర నాయకులు రామాంజనేయులు, జాన్సన్, మద్దిలేటి, జయప్రకాశ్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలి**

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడు**

**ఆయన ఆలోచనలే భవిష్యత్తు కాలనికి పునాదులు**



**పెబ్బేరు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మండల పరిధిలో శనివారం కంచిరావుపల్లి గ్రామ చౌరస్తాలో కొత్తగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ లో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి,గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్యన కోలాటం ఆటపాటలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడని ఆయన ఆలోచనల కార్యాచరణమే మన భవిష్యత్ తరాలకు పునాదులు అయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల్లో మహానుభావుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం వారి ఆశయాల సాధన కోసం కట్టుబడి ఉన్నామని సూచించడమే అవుతుందని మనం ప్రతి ఒక్కరం మహానుభావుల ఆశయాల సాధన కోసం పాటుపడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహం వద్ద తాను హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, గ్రామ నాయకులు భాస్కర్, నాగరాజు కోటి,శ్యాము, నాయకులు సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్,భాను ప్రకాష్ రెడ్డి, కంచరపల్లి గ్రామ ప్రజలు, పెద్దలు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## రాజీమార్గమే రాజ మార్గం

**జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి**

**జాతీయ లోక్ అదాలత్ లో 84 కేసులు పరిష్కారం**



**పత్తికొండ, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

రాజీ మార్గమే రాజ మార్గం అని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్. భారతి ఇరు వర్గాల కక్షిదారులను విచారించి 84 కేసులను పరిస్కరించినట్లు క్లర్క్ రాఘవేంద్ర తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు-54, సివిల్ కేసులు -14, ఈపీ కేసులు -11, గృహ హింస కేసులు - 3, భరణం కేసులు -2 ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.... రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామన్నారు. పెండింగ్ కేసులు సత్వరమే పరిస?రించడమే లోక్ అదాలత్ ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేశ్, లోక్ అదాలత్ న్యాయవాదులు నాగభూషణం రెడ్డి, రమేష్ బాబు, న్యాయవాదులు ఎల్లారెడ్డి, సురేష్ కుమార్, సత్యనారాయణ, హుల్తెన్న, ఈరన్న, మల్లికార్జున, సురేంద్ర, కృష్ణయ్య, జటంగిరాజు, రవి ప్రకాష్, బాలభాష, నారాయణ స్వామి, వెంకటేశ్వర్లు, ప్రసాద్ బాబు, మధుబాబు, దామోదర ఆచారి, సూరజ్ నబి, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్, వాసు, భాస్కర్, అరుణ్, హరిక్రిష్ణ, రజాక్, లోక్ అదాలత్, కోర్ట్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 16 నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



**పత్తికొండ, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

పత్తికొండ పట్టణంలోని వరమడిలో వెలసిన గురుదేవులు హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ పీర్ మొహియుద్దీన్ స్వాముల వారి ఉరుసు ఉత్సవాలు సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభం అవుతాయని దర్గా నిర్వాహకులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. సెప్టెంబర్ 16వ తేదీన స్వామి వారి సన్నిధిలో గంధం కార్యక్రమం ఉంటుందని అన్నారు. సెప్టెంబర్ 17న ఉరుసు మహోత్సవం, 18న జియారత్ ఫాతిహాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఉరుసు రోజున సాయంత్రం 6 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉరుసు కార్యక్రమాలలో పాల్గొనాలని హుస్సేన్ ఆలం కమిటీ వారు కోరారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**పెబ్బేరు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**




వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్ర, మండల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎస్ రాజేంద్రప్రసాద్, పిసి నెంబర్ 2456 పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో అలసత్వం వహించినందుకు సస్పెండ్ చేస్తున్నట్లు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రప్రసాద్ పెబ్బేర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తుండగా, యస్.పి. ఉత్తర్వుల మేరకు వనపర్తి పట్టణం నందు ట్రాఫిక్ విధుల గురించి వెళ్లాలని పెబ్బేరు ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి, రాజేంద్రప్రసాద్ కు తెలిపారు. అతను ట్రాఫిక్ డ్యూటీ కి వెళ్ళను అని ఎస్సై దగ్గర గొడవ పెట్టుకొని, యస్. ఐ.,వ్యక్తిగత లాప్ టాప్ పగలకొట్టడం జరిగింది. ఇట్టి విషయమును ఎస్సై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తకోట సీఐ ఈ వ్యవహారంపై విచారణ జరిపి, జిల్లా ఎస్పీకి నివేదిక పంపడమైనది. కొత్తకోట సీఐ నివేదిక పై జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్, కానిస్టేబుల్ ను సస్పెండ్ చేయడం జరిగినది. విదులపట్ల ఎవరైనా అలసత్వం ప్రవర్తిస్తే డిపార్ట్మెంట్ పరంగా చర్యలు తీసుకొన బడతాయని హెచ్చరించారు.

# ఎక్సైజ్ అధికారుల అలసత్వం.. రెచ్చిపోతున్న వైన్స్ యాజమాన్యం






**చెన్నారావుపేటలో సిండికేట్ దందా...!**

**తనిఖీలు శూన్యం...**

**మొక్కుబడిగా ఎక్సైజ్ శాఖ.....**

**శ్రీశివ గణేష్ వైన్ షాప్ పై చర్యలేవి..**

**అధికారులు అలసత్వం వీడాలంటున్న మండల ప్రజలు**

**పీపుల్స్ మోటివేషన్, చెన్నారావుపేట:-**

వరంగల్ జిల్లా చేన్నారావుపేట మండలంలోని శ్రీ శివ గణేష్ వైన్స్ యాజమాన్యం గత రెండు మాసాలుగా అక్రమంగా యదేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా అధిక రేట్లతో ఆన్లైన్ మాదిరిగా ఆటో లలో తరలిస్తూ మండలంలో గల అన్ని గ్రామాల బెల్ట్ షాపులకు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. పూర్తి సాక్ష్యాధారాలతో ఈనెల మూడవ తేదీన ( తెలంగాణం )దిన పత్రిక లో ప్రచురించగా ఎక్సైజ్ అధికారులు కానీ పోలీస్ అధికారులు కానీ చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావితీస్తుంది.ఆటో లలో మద్యం అన్ని గ్రామాలకు పట్ట పగలే అమ్ముతున్న పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు. అధికారుల మౌనం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ అమ్మకాలకు పాల్పడుతున్న శ్రీ శివ గణేష్ వైన్స్ పై చర్యలు తీసుకోకపోవడం పై నెలవారి మామూళ్ల మత్తులో అధికారులు జోగుతున్నారని మండలంలో ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

**చేన్నారావుపేట మండలంలో సిండికేట్ దందా:**

చేన్నారావు పేట మండలంలో శ్రీ శివ గణేష్ వైన్స్ యాజమాన్యం సిండికేట్ గా ఏర్పడి నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా క్వార్టర్ బాటిల్ పై పది రూపాయలు, ఆఫ్ బాటిల్ పై 20 రూపాయలు, ఫుల్ బాటిల్ పై 60 రూపాయలు సిండికేట్ గా ఏర్పడి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయంగా మారింది. అంతేకాకుండా మా వైన్స్ తరపున డోర్ డెలివరీ సదుపాయాలు కూడా ఉన్నాయి అంటూ రవాణా చార్జీలతో సహా చేస్తున్నా శ్రీ శివ గణేష్ వైన్స్ యాజమాన్యం. గత కొన్ని మాసాలుగా పెద్ద ఎత్తున అక్రమంగా మద్యం వ్యాపారం జరుగుతున్న తమకేం పట్టదన్నట్టు ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారంటూ అంటూ ఎక్సైజ్ అధికారుల పనితీరుపై మండలంలో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మొక్కుబడిగా నర్సంపేట ఎక్సైజ్ అధికారులు..**

సిండికేట్‌గా ఏర్పడిన శ్రీ శివ గణేష్ వైన్స్ యాజమాన్యంపై నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అమ్మకాలు చేపడుతున్న ఎక్సైజ్ అధికారుల చర్యలు మాత్రం కానరాక పోతున్నాయి. ఇదంతా ఇలా ఉంటే పలు పత్రికలలో ప్రచురితమైన వార్తలకు ఉన్నతాధికారులు స్పందించకపోవడం చాలా శోచనీయం. అధికారుల పనితీరును బట్టి మండల ప్రజలు మొక్కుబడిగా ఎక్సైజ్ అధికారులు తమ విధులు నిర్వర్తిస్తున్నారంటూ అధికారులపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు అలసత్వం వీడాలి..**


**(సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పత్తి. అనంతరెడ్డి)**

ఎక్సైజ్ ఉన్నత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. తక్షణమే మండల పోలీస్ అధికారులు స్పందించి అక్రమంగా ఆటోలలో డోర్ డెలివరీ చేస్తున్న మద్యం ఆటోను సీజ్ చేసి నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న శ్రీ శివ గణేష్ వైన్స్ షాప్ పై చర్యలు చేపట్టి అక్రమ అమ్మకాలను అరికట్టాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పత్తి. అనంతరెడ్డి అన్నారు. అక్రమంగా గ్రామాలలో ఆటోలతో మద్యం డోర్ డెలివరీ చేస్తున్న వైన్స్ యాజమాన్యంపై చర్యలు చేపట్టకపోతే మహిళా సంఘాలతో మద్యం ఆటోను అడ్డుకోవడానికి కూడా వెనుకాడబోమని వారు అన్నారు.

# గణేష్ నిమజ్జనం సజావుగా సాగేలా గట్టి చర్యలు తీసుకోండి








**కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్**

**కర్నూలు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని ఊరేగింపు మార్గాలు, గణేష్ నిమజ్జన ఘాట్ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు. వినాయక ఉత్సవాల్లో ఆఖరు ఘట్టమైన గణేష్ నిమజ్జనం జిల్లా కేంద్రంలో సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఐపియస్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో రేపు జరిగే గణేష్ నిమజ్జనం నేపథ్యంలో గణేష్ నిమజ్జనం ఘాట్ లో జిల్లా ఎస్పీ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక ప్రతిమల ఊరేగింపు మొదలు నిమజ్జనం పూర్తీ అయ్యేవరకు ఆయా ఉత్సవ కమిటీలు కీలక పాత్ర పోషించి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

# తండాలనుఅన్ని విధాల అభివృద్ధి పరుస్తా



**అక్టోబర్ నుంచి తండాలోనే రేషన్ బియ్యం పంపిణీకి ఎమ్మెల్యే ఆదేశాలు**

**వనపర్తిఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి**

**పెబ్బేరు, సెప్టెంబర్ 14 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు మండల పరిధిలో కంచిరావ్ పల్లి తండాను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని అక్టోబర్ నెల నుంచి గ్రామంలోని రేషన్ బియ్యం పంపిణీ చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కంచిరావుపల్లి తండాలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. తండావాసులు ఎమ్మెల్యే,దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తండాకు ప్రధానంగా ఉన్న రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే మూడు కోట్ల రూపాయలను రోడ్డు నిర్మాణానికి కేటాయించి ఉందని ఆయన పేర్కొన్నారు. తండాకు సమస్యగా మారిన సాగునీటి సమస్య పరిష్కారానికి కావలసిన కెనాల్ ను అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తండాలో నిర్మించుకునే ఆలయానికి తనవంతు సహకారం అందిస్తానని తండావాసులకు ఎమ్మెల్యే భరోసా కల్పించారు. రుణమాఫీ, ఫించన్లు, రేషన్ కార్డు లు, ఇందిరమ్మ ఇళ్లు మొదటి ప్రాధాన్యత కింద తండా వాసులకు ప్రతి ఒక్కరికీ అందజేస్తా మని ఎంఎల్ఏ పేర్కొన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, గ్రామ నాయకులు భాస్కర్ నాగరాజు కోటి శ్యాము మండల నాయకులు సురేందర్ గౌడ్ రంజిత్ కుమార్ భాను ప్రకాష్ రెడ్డి కంచరపల్లి గ్రామ పెద్దలు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆదివారం | సెప్టెంబర్ | 15 | 2024



# ధోనీ తర్వాతే నా రిటైర్మెంట్..

మాజీ టీం ఇండియా స్పిన్నర్ పీయూష్ చావ్లా తన రిటైర్మెంట్ గురించి చాలా ఆసక్తికరమైన సమాధానం ఇచ్చాడు. పృథ్వీ షా ఒకసారి రిటైర్మెంట్ గురించి తనతో ఒక ప్రశ్న అడిగాడని.. దానికి నేను సచిన్ టెండూల్కర్‌తో ఆడానని, అతని కొడుకుతో కూడా ఆడానని బదులిచ్చాను. ఇప్పుడు నీ కొడుకుతోనూ ఆడేసి అప్పుడు రిటైర్ అవుతాను అంటూ చెప్పి నవ్వులు పూయించానని తెలిపాడు.పీయూష్ చావ్లా గురించి మాట్లాడితే, అతని అంతర్జాతీయ కెరీర్ అంత ప్రత్యేకమైనది కాదు. అతను తన కెరీర్‌లో 3 టెస్టులు, 25 %ాణ×%లు, 7 %ు%20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడాడు. ఈ సమయంలో అతను టెస్టులో 7, వన్డేల్లో 32, టీ20లో 4 వికెట్లు తీశాడు. 2006లో అరంగేట్రం చేసిన పీయూష్ చావ్లా డిసెంబర్ 2012లో ఇంగ్లండ్‌తో తన చివరి మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టీమిండియా తరపున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. అతను 2011 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో భాగమయ్యాడు. పీయూష్ చావ్లా అంతర్జాతీయ కెరీర్ చాలా కాలం క్రితం ముగిసినప్పటికీ, అతను ఇప్పటికీ ఐపీఎల్‌తో సహా ఇతర దేశవాళీ లీగ్‌లలో ఆడుతున్నాడు. చావ్లా వయసు 35 ఏళ్లు అయినప్పటికీ అతని ఫిట్‌నెస్‌పై పెద్దగా ప్రభావం పడలేదు. ఇటీవల శుభంకర్ మిశ్రా పోడ్‌కాస్ట్‌లో, ధోని ముందుగా రిటైర్ అవుతాడా లేదా మీరు రిటైర్ అవుతాడా అని పీయూష్ చావ్లాను ఓ ప్రశ్న అడిగాడు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. ఎంఎస్ ధోని ముందుగా రిటైర్ అవుతాడు. తర్వాత నేను రిటైర్ అవుతాను (నవ్వుతూ). కొంతకాలం క్రితం పృథ్వీ షా నాతో పీసీ భాయ్, రిటైర్మెంట్ ఎప్పుడు అన్నాడు. నేను సచిన్ టెండూల్కర్‌తో ఆడానని, అతని కొడుకుతో కూడా ఆడానని చెప్పాను. ఇప్పుడు నేను మీతో ఆడుతున్నాను. నీ కొడుకుతోనూ ఆడిన తర్వాత రిటైర్ అవుతాను అంటూ చెప్పానని నవ్వులు పూయించాడు. ఐపీఎల్‌లో పీయూష్ చావ్లా అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఐపీఎల్ 2023లో ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్నప్పుడు అతను అద్భుత ప్రదర్శన చేశాడు. గత సీజన్‌లో కూడా అదే జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఇప్పుడు అతను ఏ టీమ్‌కి వెళ్తాడు అనేది చూడాలి.



## క్రికెట్లో అద్భుత దృశ్యం.. ఒకే ఫ్రేమ్ లో 13 మంది ప్లేయర్లు?



ప్రస్తుతం క్రికెట్ కి ఉన్న ఆదరణ ప్రపంచ దేశాలలో మరింత ఎక్కువగా పెరిగిపోతుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే క్రికెట్ ఎంటర్టైన్మెంట్ పొందడానికి అందరూ తెగ ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు అందుకే ప్రపంచ నలుమూలల్లో ఎక్కడ క్రికెట్ మ్యాచ్ జరిగిన..ఆ మ్యాచ్ లో ఎలాంటి ఆసక్తికర ఘటన జరిగిన కూడా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారిపోతూ ఉంటుంది. అయితే క్రికెట్ అంటే జెంటిల్మెన్ గేమ్ అని అంటూ ఉంటారు. కానీ క్రికెట్లో ఎన్నోసార్లు ఫన్నీ ఘటనలు జరుగుతూ ఉంటాయి. ఇక ఇలాంటి ఘటన ఏదైనా జరిగిందంటే అది ఇంటర్నెట్లో వైరల్ గా మారిపోతూ ఉంటుంది అని చెప్పాలి. ఇప్పుడు ఇలాంటి ఒక అరుదైన దృశ్యంకి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. సాధారణంగా క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఫీల్డర్లు మైదానం మొత్తం ఫీల్డింగ్ చేయడం చూస్తూ ఉంటాము అన్న విషయం తెలిసిందే. బ్యాట్స్మెన్ కొట్టిన బంతిని ఎక్కడ బౌండరీ పోకుండా ఉండేలా పకడ్బందీగా ఆయా జట్టు కెప్టెన్లు ఫీల్డింగ్ సెట్ చేయడం చూస్తూ ఉంటాం. కానీ ఏకంగా జట్టులో ఉన్న 11 మంది ఆటగాళ్లు కూడా ఏకంగా బ్యాటింగ్ చేస్తున్న ప్లేయర్ నూ రౌండప్ చేసి కన్ఫ్యూజ్ చేయడం లాంటి అరుదైన ఘటనలు అప్పుడప్పుడు క్రికెట్లో జరుగుతూ ఉంటాయి. ఇటీవల ఇలాంటి ఘటన జరిగింది అని చెప్పాలి. ఏకంగా క్రికెట్లో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఇంగ్లాండు కౌంటి క్రికెట్లో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ గా మారిపోయింది. ఏకంగా ఒకే ఫ్రేమ్ లో 13 మంది ప్లేయర్లు కనిపించారు. సోమర్ సెట్ పై 252 పరుగులు లక్ష్యంతో బరిలోకి దిగిన సర్రే టీం 109/9 స్కోర్ వద్ద నిలిచింది. అయితే మూడు నిమిషాల్లో ఆట ముగుస్తుంది అన్న సమయంలో సోమర్ సెట్ బౌలర్ వికెట్ కీపర్ మాత్రమే కాకుండా 9 మంది ఫీల్డర్లనూ కూడా బ్యాట్స్మెన్ చుట్టూ ఉంచాడు ఆ జట్టు కెప్టెన్. దీంతో ఒత్తిడితో సర్రె బ్యాట్స్మెన్ టికెట్ సమర్పించుకున్నాడు. అయితే ఈ ఘటన జరిగిన సమయంలో సర్రే టీం కి చెందిన ఇద్దరు బ్యాట్స్మెన్లు ఇక సోమర్ సెట్ కు చెందిన 11 మంది ఆటగాళ్లు ఒకే ప్రేమలో కనిపించారు.

## ఇండియాలో ఇలా జరగడం మొదటి సారి?



సాధారణంగా టెస్ట్ మ్యాచ్ జరుగుతుంది అంటే చాలు ఇరు జట్లు ఆ మ్యాచ్ ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం చూస్తూ ఉంటాం. తప్పనిసరిగా ఆ మ్యాచ్ లో విజయం సాధించాలని కోరుకుంటూ ఉంటాయి.అయితే ఒకవేళ ఒక మ్యాచ్లో ఓడిపోయిన తర్వాత మ్యాచ్లో అయినా బాగా రానించాలని సిరీస్ లో పైచేయి సాధించాలని అనుకుంటూ ఉంటారు. కానీ ఏకైక టెస్ట్ మ్యాచ్ ఉంటే అందులో తప్పక విజయం సాధించాలని పట్టుదల ఇరు జట్లకు ఉంటుంది. అయితే ఇటీవల ఇలాంటి పట్టుదలతోనే ఉన్న న్యూజిలాండ్ ఆఫ్ఘనిస్తాన్ జట్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. గ్రేటర్ నోయిడా వేదికగా ఇరుజట్ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు చివరికి వర్షార్పణం అయిపోయింది. చివరి రోజు కూడా వర్షం పడటంతో ఎంపైర్లు శుక్రవారం మ్యాచ్ నూ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కనీసం టాస్ కూడా పడకుండానే మ్యాచ్ తుడిచిపెట్టుకుపోయింది అని చెప్పాలి. అయితే మ్యాచ్ జరిగేలా చేయడానికి గ్రౌండ్ సిబ్బంది ఎంతలా శ్రమించిన మైదానం ఆటకు అనుకూలంగా లేకపోవడంతో తొలిరోజు ఆట సాధ్యపడలేదు. డ్రైనేజీ వ్యవస్థ, మైదానాన్ని సిద్ధం చేసే పరికరాలు అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశం గా మారింది. రెండో రోజు నుంచి వర్షం కురవడం తో ఆట రద్దు అవుతూ వచ్చింది. చివరి రోజు శుక్రవారం కూడా వరుణుడు కరుణించక పోవడంతో చివరికి చేసేదేమీ లేక అంపైర్లు మ్యాచ్ రద్దు చేశారు. దీంతో గ్రేటర్ నోయిడా చెత్త రికార్డును మూట పెట్టుకుంది. 1933 నుంచి భారత్ సుదీర్ఘ మ్యాచ్లకు ఆతిథ్యం ఇస్తుంది. 91 ఏళ్లలో కనీసం ఒక్క బంతి కూడా పడకుండా ఓ టెస్ట్ మ్యాచ్ రద్దు అవడం భారత్ లో ఇదే తొలిసారి. ఆసియాలో ఇది రెండో సారి. 1998లో పాక్ వేదికగా పాక్ - జింబాబ్వే మధ్య జరిగిన మూడో టెస్ట్ బంతి పడకుండానే తుడిచి పెట్టుకు పోయింది.

## దులీప్ ట్రోఫీలో దుమ్మురేపిన కేఎల్ రాహుల్ ఫ్రెండ్..



దులీప్ ట్రోఫీలో మూడో మ్యాచ్ భారత్ ఎ, ఇండియా డి మధ్య జరుగుతుంది. ఇండియా డి తరపున ఆడుతున్న దేవదత్ పడిక్కల్ ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 124 బంతులు ఎదుర్కొని 15 బౌండరీలతో 92 పరుగులు చేశాడు.కానీ, కేవలం 8 పరుగుల తేడాతో సెంచరీ మిస్సయ్యాడు. అయితే, పడిక్కల్ ఇన్నింగ్స్‌కు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. బంగ్లాదేశ్‌తో జరిగే 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం టీమిండియా సన్నాహాలు ప్రారంభించింది. మరోవైపు దులీప్ ట్రోఫీలో యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుతున్నారు. వీరిలో స్టార్ బ్యాట్స్‌మెన్ దేవదత్ పడిక్కల్ పేరు కూడా ఉంది. ఈ టోర్నీలో పడిక్కల్ వరుసగా రెండో అర్ధ సెంచరీ చేయడం అందరి దృష్టినీ ఆకర్షించింది. దులీప్ ట్రోఫీలో భాగంగా భారత్ ఎ, ఇండియా డి మధ్య మూడో మ్యాచ్ జరుగుతోంది. ఇండియా డి తరపున ఆడుతున్న దేవదత్ పడిక్కల్ ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 124 బంతులు ఎదుర్కొని 15 బౌండరీలతో 92 పరుగులు చేశాడు. కానీ, కేవలం 8 పరుగుల తేడాతో సెంచరీ మిస్సయ్యాడు. అయితే, పడిక్కల్ ఇన్నింగ్స్‌కు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఎందుకంటే, ఇండియా డి జట్టుకు పడిక్కల్ తప్ప మరే బ్యాట్స్‌మెన్ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. పడిక్కల్ చేసిన 92 పరుగులే దీనికి ఉదాహరణ. మొత్తం జట్టు కేవలం 183 పరుగులకే ఆలౌటైంది. పడిక్కల్ ఇంత పెద్ద ఇన్నింగ్స్ ఆడకపోతే ఇండియా డి జట్టు పరిస్థితి దయనీయంగా ఉండేది. ఈ మ్యాచ్‌లో 92 పరుగులతో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన పడిక్కల్.. దులీప్ ట్రోఫీ తొలి రౌండ్‌లో కూడా హాఫ్ సెంచరీ సాధించాడు. 2021లో అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించిన దేవదత్ పడిక్కల్ శ్రీలంక పర్యటనకు టీ20 జట్టుకు ఎంపికయ్యాడు. ఈ పర్యటనలో అతను రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం పొంది 38 పరుగులు చేశాడు. అయితే, దీని తర్వాత అతనికి భారత టీ20 జట్టులో చోటు దక్కలేదు. ఈ ఏడాది ప్రారంభంలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడే అవకాశం దేవదత్ పడిక్కల్‌కు లభించింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అతను తన తొలి ఇన్నింగ్స్‌లో 65 పరుగులు చేశాడు. అయితే, ఇప్పుడు బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్‌కు ఎంపిక చేసిన జట్టులో అతనికి చోటు కల్పించలేదు.

## 45 బంతుల్లో 139.. ఒక్కడే ఓడించాడు?



ఇండియన్ క్రికెట్లో కొత్త ప్రతిభకు కొదవ లేకుండా పోయింది అన్న విషయం తెలిసిందే. ఇక భారత్లో క్రికెట్ కి ఉన్న క్రేజ్ దృశ్య ఎంతో మంది యువకులు ఇక బంతి బ్యాట్ వైపుగా అడుగులు వేస్తూ ఉన్నారు. ఈ క్రమంలోనే క్రికెట్ నే ఫ్యాషన్ గా మార్చుకుంటూ ముందుకు సాగుతూ టీమ్ ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించాలని ఎంతగానో ఆశ పడుతున్నారు. ఇక ఇలా లక్ష్యాన్ని చేరుకునేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు. దేశవాళీ క్రికెట్లో జరిగే టోర్నీలలో అదరగొడుతున్నారు అని చెప్పాలి. అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకుంటూ టాక్ ఆఫ్ ది ఇండియన్క్రికెట్ గా మారి పోతున్నారు. అయితే గత కొంత కాలం నుంచి ఎంతోమంది యంగ్ ప్లేయర్లు బ్యాటింగ్లో సృష్టిస్తున్న విధ్వంసం ఇండియన్క్రికెట్ ప్రేక్షకులందరికీ కూడా ఆశ్చర్యపరుస్తూ ఉంది అన్న విషయం తెలిసిందే. తాను టీమిండియా ఫ్యూచర్ అనే విషయాన్ని కేవలం మాటలతో కాదు.. తమ ఆట తీరుతోనే నిరూపిస్తూ ఉన్నారు. అయితే ఇక్కడ ఇలాంటి ఒక విధ్వంసకరమైన ఇన్నింగ్స్ ఇండియన్క్రికెట్ లో హాట్ టాపిక్ గా మారిపోయింది. యువ ఆటగాడు వీరోచితమైన సెంచరీ గురించి ప్రస్తుతం అందరూ మాట్లాడుకుంటున్నారు. కేరళక్రికెట్ లీగ్ లో త్రిశూర్ టైటాన్స్ ఆటగాడు విష్ణు వినోద్ బ్యాటింగ్ విధ్వంసం ప్రోత్సహించాడు. అలిప్పీ రేపిల్స్ తో జరిగిన మ్యాచ్లో 65 బంతుల్లోనే 139 పరుగులు చేశాడు. ఇందులో 17 సిక్సర్లు ఐదు ఫోర్లు ఉన్నాయి. తొలత అలిపి 20 ఓవర్లలో 181 / 6 పరుగులు చేయగా.. వినోద్ వీర విహారం తో త్రిశూర్ జట్టు 12.4 ఓవర్ల లోనే లక్ష్యాన్ని చేరుకుంది. కాగా అతన్ని ముంబై ఇండియన్స్ 20 లక్షలకు కొనుగోలు చేసింది. అంతకుముందు ఢిల్లీ, సన్రైజర్స్ జట్ల తరఫున కూడా అతను ప్రాతినిధ్యం వహించాడు.

## జడేజా వారసుడు వచ్చేస్తున్నాడు..

దులీప్ ట్రోఫీ 2024లో నాలుగో మ్యాచ్ ఇండియా బి వర్సెస్ ఇండియా డి మధ్య జరుగుతోంది. ఈ సమయంలో, ఇండియా సి మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి 450 కంటే ఎక్కువ పరుగులు చేసింది. ఇందులో ఇషాన్ కిషన్, బాబా ఇందర్‌జిత్ వంటి బ్యాట్స్‌మెన్‌లతో పాటు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు కూడా తోడయ్యాయి. ఈ సమయంలో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఓ ఆటగాడిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తొలి మ్యాచ్‌లో బంతితో అద్భుతాలు చేసిన ఈ ఆటగాడు.. రెండో మ్యాచ్‌లో బ్యాట్‌తో అద్భుతాలు చేశాడు. అయితే, ఈ ఆటగాడు ఇప్పుడు రవీంద్ర జడేజాకు కూడా ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు అంటూ మాజీలు మాట్లాడుతున్నారు. దులీప్ ట్రోఫీ 2024లో తన మొదటి మ్యాచ్‌లో ఇండియా సి తరపున ఆడుతున్న మానవ్ సుతార్ మొత్తం 8 వికెట్లు (రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు) పడగొట్టాడు. ఇప్పుడు బౌలింగ్ తర్వాత, మానవ్ సుతార్ రెండో మ్యాచ్‌లో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. ఇండియా సి తరపున ఏడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ హాఫ్ సెంచరీ చేశాడు. మానవ్ సుతార్ ఈ ప్రదర్శన అతనికి భారత జట్టులో తదుపరి ఆల్ రౌండర్ ఆటగాడిగా చోటు సంపాదించవచ్చు. భవిష్యత్తులో జట్టులో చోటు దక్కించుకోగల రవీంద్ర జడేజాకు ఎడమచేతి వాటం స్పిన్ బౌలర్ వారసుడిగా అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం, దులీప్ ట్రోఫీ టోర్నమెంట్ అతని కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయిగా నిరూపిస్తోంది. ఇది అతని తదుపరి టెస్ట్ కెరీర్‌కు పెద్ద ఊపునిస్తుంది.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## కౌన్ బనేగా కరోడ్‌పతిలో పవన్ కళ్యాణ్‌పై ప్రశ్న



హీరోగా ఇండస్ట్రీలో చెదరని ముద్ర వేసిన పవన్ రాజకీయాల్లోనూ చరిత్ర సృష్టించారు. తన పార్టీ నుంచి పోటీ చేసిన ప్రతి ఒక్కరూ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో.. 21 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాలను సొంతం చేసుకున్నారు. దీంతో పవన్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. ఈ క్రమంలో ప్రఖ్యాత 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోలో పవన్ కల్యాణ్‌కు సంబంధించిన ప్రశ్న అడగడం విశేషం. ప్రస్తుతం కౌన్ బనేగా కరోడ్‌పతి' 16వ సీజన్ నడుస్తోంది. బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ దీనికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన ఎపిసోడ్‌లో బిగ్‌బీ ఓ కంటెస్టెంట్‌ను పవన్‌కు సంబంధించిన ప్రశ్న అడిగారు. '2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నటుడు ఎవరు?' అని అడిగారు. కంటెస్టెంట్ ఈ ప్రశ్నకు 'ఆడియన్స్ పోల్' ఆప్షన్ తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆడియన్స్‌లో 50 శాతం మందికి పైగా పవన్ కల్యాణ్ అని చెప్పారు. దీంతో వారు పవన్ పేరు చెప్పి లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ.1.60లక్షలు గెలుచుకొని తర్వాత ప్రశ్నకు వెళ్లారు.

## దేవర ప్రమోషన్స్ జోరు

**సందీప్ వంగాతో టీమ్ చిట్‌చాట్**




కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన సినిమా 'దేవర' ప్రమోషన్లు జోరుగా సాగుతున్నాయి. భారీ అంచనాల మధ్య ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మూవీ టీమ్ ప్రచారం జోరు పెంచింది. 'యానిమల్' దర్శకుడు సందీప్ వంగాతో 'దేవర' టీమ్ చిట్‌చాట్ నిర్వహించింది. దానికి సంబంధించిన లేటెస్ట్ ప్రోమో తాజాగా విడుదలైంది. 35రోజులు అండర్ వాటర్ సీక్వెన్స్ చేసినట్లు ఎన్టీఆర్ చెప్పగా.. 'దేవర' అందరి కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందని జాన్వీ అన్నారు. ఈ సినిమా రన్ టైమ్ పై సందీప్ సరదాగా కామెంట్ చేశారు. ఇటీవల ముంబైలో ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం 'యానిమల్' దర్శకుడు సందీప్ వంగాతో దేవర' టీమ్ చిట్‌చాట్ నిర్వహించింది. దానికి సంబంధించిన లేటెస్ట్ ప్రోమో తాజాగా విడుదలైంది. సందీప్ అడిగిన ప్రశ్నలకు తారక్ తనదైన శైలిలో జవాబిచ్చారు. ఇదొక యాక్షన్ డ్రామా అని, మాస్ ఎలిమెంట్స్‌లో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగిస్తుందని చెప్పారు తారక్. చాలా సంవత్సరాలుగా తారక్, నేను మంచి స్నేహితులమని శివ కొరటాల తమ బాండింగ్ గురించి చెప్పారు. మీరు సినిమా కథ అంతా చెప్పేయమంటున్నారు అని జాన్వీ సందీప్‌పై పంచ్‌లు విసిరింది. ఈ సినిమా రన్ టైమ్ పై సందీప్ సరదాగా కామెంట్ చేశారు. దానికి తారక్ యానిమల్ రన్ టైమ్ ఎంత అని అడగగా 3 గంటల 24 నిమిషాలని నవ్వుతూ సందీప్ రెడ్డి వంగా చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రోమో వైరల్ అవుతోంది.

### అసభ్యంగా తాకిన వ్యక్తి చెంప ఛెళ్లుమనిపించా

వేధింపులు ఎదురైనప్పుడు మహిళలు తప్పకుండా స్పందించాలని నటి ఈషా దేవోల్ తెలిపారు. తాను ఒకానొక సమయంలో గుర్తు తెలియని వ్యక్తిని కొట్టానని చెప్పారు. ఓ సినిమా ఫంక్షన్‌లో అతడు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 2005లో తెరకెక్కిన 'దాస్' ప్రీమియర్ ఈవెంట్‌లో ఒక సంఘటన చోటుచేసుకుంది. ఆ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పుణెలో ఈవెంట్ నిర్వహించారు. ప్రధాన నటీనటులతో కలిసి నేనూ ఆ కార్యక్రమానికి వెళ్లా. మమ్మల్ని చూసేందుకు జనాలు పెద్దఎత్తున వచ్చారు. చాలామంది బౌన్సర్ల మధ్య ఫంక్షన్ హాల్‌లోకి అడుగుపెడుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి నన్ను అభ్యంతరకర రీతిలో తాకాడు. నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. వెంటనే, అతని చేయి పట్టుకొని గుంపులో నుంచి బయటకు లాగి.. చెంప చెళ్లుమనిపించా. అందరూ షాక్ అయ్యారు. సాధారణంగా నేను సరదాగా ఉండే వ్యక్తిని. ప్రతీ విషయాన్ని ఒక స్థాయి వరకూ అంగీకరిస్తా. నా సహనాన్ని పరీక్షిస్తూ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే తప్పకుండా రియాక్ట్ అవుతా. నేనే కాదు ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి మహిళా స్పందించాలి. శారీరకంగా పురుషులు బలవంతులు కావచ్చు. అంతమాత్రాన స్త్రీలను ఇబ్బందిపెట్టే హక్కు వారికి లేదు' అని ఈషా తెలిపారు. బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర, నటి హేమామాలిని దంపతుల కుమార్తెగా ఈషాదేవోల్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు.



## హేమ కమిటీ రిపోర్టు చూసి షాకయ్యా

### మహిళల రక్షణకు సరైన సంస్థలు రావాలన్న శ్రద్ధ

ఇండస్ట్రీలో మహిళలపై వేధింపులు ఆగాలంటే పటిష్టమైన సంస్థలు రావాలని బాలీవుడ్ నటి శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తన సినీ ప్రయాణం గురించి చెప్పారు. అలాగే హేమ కమిటీని ఉద్దేశించి మాట్లాడారు. 'నేను మలయాళ చిత్ర పరిశ్రమలోనూ పనిచేశాను. కానీ, నేనెప్పుడూ వేధింపులు ఎదుర్కోలేదు. సురక్షితంగా ఉన్నాను. పార్టీలకు వెళ్లి ఇంటికి వస్తున్నప్పుడు నా చుట్టూ ఏం జరుగుతుందో గమనించుకుంటూ ఉండేదాన్ని. డ్రైవర్ ఎటు చూస్తున్నాడో ఎప్పుడూ అప్రమత్తతతో వ్యవహరించేదాన్ని. ఎనిమిదేళ్ల వయసు నుంచే అలా జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నా. అందుకే నాకు ఎప్పుడూ పరిశ్రమలో వేధింపులు ఎదురుకాలేదు. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని. సినిమా సెట్‌లో మహిళలకు సరైన పారిశుధ్య సౌకర్యాలు ఉండవు. అలాంటి కనీస అవసరాలు కచ్చితంగా ఉండేలా చూడాలి. హేమ కమిటీ రిపోర్ట్ చూసి షాకయ్యాను. సమస్యలను ఎదుర్కొంటున్న మహిళలు వాటిని ఎవరితో చర్చించాలో తెలియక ఆగిపోతున్నారు. పరిశ్రమలో మహిళలపై వేధింపులు ఆగాలంటే పటిష్ఠంగా పనిచేసే సంస్థలు రావాలని శ్రద్ధ అభిప్రాయపడ్డారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జస్టిస్ హేమకమిటీ సిద్ధం చేసిన రిపోర్ట్ గత కొన్ని రోజులుగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి ఇప్పటికే పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను బయటపెట్టారు. అన్ని ఇండస్ట్రీల్లోనూ ఇలాంటి ఓ కమిటీని ఏర్పాటుచేయాలని కొందరు నటీనటులు కోరుతున్నారు.

## ముద్దు సీన్లలో నటించడం అంత తేలిక కాదు

**యుద్ధ్రా ఇంటిమేట్ సీన్లపై నటి మాళవికా మోహనన్**

'మాస్టర్', 'తంగలాన్' వంటి చిత్రాలతో దక్షిణాది వారికి చేరువైన కేరళ బ్యూటీ మాళవికా మోహనన్ బాలీవుడ్ ప్రేక్షకులనూ అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఆమె కథానాయికగా నటించిన హిందీ మూవీ 'యుద్ధ్రా' తో ఆమె బాలీవుడ్‌లోకి తెరంగేట్రం చేస్తున్నారు. ఇందులో ఆమె పలు ఇంటిమేట్, ముద్దు సన్నివేశాల్లో యాక్ట్ చేశారు. దీనిని ఉద్దేశించి




తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంటిమేట్ సీన్స్‌లో యాక్ట్ చేయడం అంత సులభం కాదన్నారు. ఇంటిమేట్ సీన్స్ చిత్రీకరించేటప్పుడు ఏ సినిమా సెట్‌లోనైనా ఇంటిమేట్ కో-ఆర్డినేటర్‌ను నియమిస్తున్నారు. నటీనటులు ఇబ్బందిపడకుండా ఆయా సన్నివేశాల్లో ఎలా యాక్ట్ చేయాలో వారు చెబుతుంటారు. అది చాలా మంచి నిర్ణయం. అయితే, మా సెట్‌లో అలాంటి కో-ఆర్డినేటర్స్ ఎవరూ లేరు. 'సాథియా' పాట గురించి చెప్పినప్పుడు సిద్ధాంత్, నేను మొదట కంగారుపడ్డాం. 'దీనిని మనం చేయగలమా' అని సందేహం వ్యక్తంచేశాం. సముద్ర తీరం, అందులోనూ చలి తీవ్రత తట్టుకోలేక.. ఏదో ఒకరకంగా దీనిని పూర్తి చేసేయడం మంచిదని భావించి.. దర్శకుడు చెప్పినవిధంగా చేసేశాం. ఇంటిమేట్, లేదా ముద్దు సన్నివేశాల్లో యాక్ట్ చేయడం అంత సులభం కాదు. నటీనటుల మధ్య మంచి అనుబంధం ఉండాలి. సౌకర్యవంతమైన వాతావరణం ఉండాలని మాళవిక తెలిపారు. యాక్షన్ ఫిల్మ్‌గా 'యుధ్రా' సిద్ధమైంది. శ్రీధర్ రాఘవన్ కథ రాయగా.. రవి ఉద్యావర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా నటించారు. సెప్టెంబర్ 20న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినీప్రియులను ఆకట్టుకున్నాయి. ఇటీవల 'సాథియా' పాట విడుదలైంది. ఈ పాటలో సిద్ధాంత్ - మాళవికపై చిత్రీకరించిన పలు సన్నివేశాలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'యుద్ధ్రా'లో యాక్ట్ చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని మాళవిక పలు సందర్భాల్లో తెలిపారు. హిందీ ప్రేక్షకులు సైతం తనని ఆదరించాలని కోరుకున్నారు.



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com